క్లుప్తంగా

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల: దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఏడాది పాడిపంటలు బాగా పండి రైతులకు మేలు చేసేవిధంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

దీపావళి శుభాలు చేకూర్చాలి



భట్టిప్రోలు: అజ్ఞాన చీకట్లను పాలదోలి మన జీవితంలో వెలుగులను నింపే దీపావళి అందరికి శుభాలు చేకూర్చాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దీపావళి దివ్య కాంతుల వేళ నియోజకవర్గ ప్రజలందరికీ సిరి సంపదలు, ఆయురారోగ్యం సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

శ్రీ గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పెదపులివర్రు గ్రామదేవత శ్రీ గోగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రాతఃకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక విశేష పూజలు జరిగాయి. బంగారు కల్పవల్లిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆచార్య కృపాచారికి సన్మానం



తెనాలి అర్బన్: జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిని బోసు రోడ్డులోని టౌన్ చర్చిలో పాస్టర్లు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవరెండ్ దేవరపల్లి ఏసు రత్నం మాట్లాడుతూ ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్, యునెస్కో సంయుక్త ఆధ్వర్యంలో కృపాచారికి పురస్కారాన్ని అందించడం అభినందనీయమని తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెవరెండ్ ప్రకాష్‌బాబు, రెవరెండ్ డేవిడ్ ఇమ్మానుయేలు, సంఘ పెద్దలు ఐనంపూడి డేవిడ్ రాజు, చల్లపల్లి ఫ్రాన్సిస్, వేమయ్య, ఘంటయ్య, అంబేడ్కర్, రాజకుమారి, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుడి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డు సమీపంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఏడో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు జరిగాయి. వేమవరం గ్రామానికి చెందిన సీతారామ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్నదానం జరిగింది.

ప్రార్థనతో విధిరాత మారుతుంది

తాడేపల్లి రూరల్: దువా(ప్రార్థన)తో విధిరాత మారుతుందని జమియత్ అహ్లె హదీస్ గుంటూరు జిల్లా అమీర్ జనాబ్ అబ్దుల్ రహమాన్ అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం మస్జీద్ ఎ తౌహిద్‌లో ఆదివారం ధార్మిక సమావేశాన్ని నిర్వహించారు. అబ్దుల్ రహమాన్. అల్లాతో మానవ సంబంధం ఎలా ఉండాలో ప్రసంగించారు. సమస్త ప్రశంసలు, సకల ఆరాధనలు, సర్వజీవ పరిపోషకుడు, విశ్వవ్యవస్థ ఆధార భూతుడైన అల్లాకు మాత్రమే శోభిస్తాయన్నారు. దువా అంటే అల్లాను ప్రార్థించడం, వేడుకోవడమన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా జిమయత్ అహ్లె హదీస్ ప్రధాన కార్యదర్శి జనాబ్ అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

కారుపై కూలిన చెట్టు



నెహ్రూనగర్: బృందావన్‌గార్డెన్స్ మెయిన్ రోడ్డులో ఆదివారం సాయంత్రం భారీ చెట్టు కూలింది. ఆ సమయంలో కారు అక్కడ ఉండటంతో కారుపై పడడంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా చెట్టు కూలడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాల్సిందే!

- పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'రచ్చబండ'
- కోటి సంతకాల సేకరణకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్న ప్రజలు



భట్టిప్రోలు మండలం పల్లెకోనలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ పరిశీలకులు, నాయకులు, గ్రామస్తులు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు మండలం పల్లెకోనలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు మోర్ల కోటేశ్వరరావు, వివిధ విభాగాల నాయకులు బొల్లెద్దు ప్రతాప్ కుమార్, గొడుగు శ్రీనివాసరావు, నూతక్కి జస్వంత్‌రాజ్, పులివర్తి సుధాకర్, కొమ్ము వినోద్, బొల్లెద్దు సుధాకర్, చిక్కాల శ్రీనివాసరావు, బుల్లెట్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని చింతమోటు పంచాయతీలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పరిశీలకులు పేటేటి కిరణ్‌బాబు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. భట్టిప్రోలు గ్రామంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కె.రమేష్, మండల కన్వీనర్ పి. శ్రీనివాసరావు, వివిధ విభాగాల నాయకులు జంగాల సర్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతుమర్రులో...

వేమూరు: వేమూరు మండలం పోతుమర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ పరిశీలకుడు జంపని పురుషోత్తం ఆధ్వర్యంలో ఆదివారం రచ్చబండ నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు క్లైవరపు ఏసుదాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరించారు. నాయకులు ఈపూరు బాబురావు, క్లైవరపు నరేష్, ఈపూరు ధర్మారావు, చందోలు బాబురావు, కూచిపూడి మోజెష్, క్లైవరపు సలోమన్, ఏజెండ్ల రవీంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూల్పూరులో...

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ పరిశీలకుడు మైలా వెంకట్రావు అధ్వర్యంలో ఆదివారం రచ్చబండ నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు అల్లమూడి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామంటూ సంతకాల సేకరణ చేపట్టారు. సంపతి ఏడుకొండలు, బి.కిరణ్, మూల్పూరు విద్యాసాగర్, పులివర్తి అశోక్‌కుమార్, కొమ్మురి చిన సుందరావు, కటెవరపు వరికుమార్, పాలి రవి కుమార్, అల్లూరు నెపోలియన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో సంతకాల పత్రాలను చూపుతున్న పార్టీ మండల కన్వీనర్ పి. శ్రీనివాసరావు

నేటి పీజీఆర్ఎస్ రద్దు

రేపల్లె: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి పర్వదినం దృష్ట్యా తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు ఆర్డీఓ రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సోమవారం నుంచి కార్యక్రమాన్ని కొనసాగించటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

హరిత దీపావళి జరుపుకోవాలి

భట్టిప్రోలు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా హరిత దీపావళిని జరుపుకోవాలని భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య ఆదివారం పేర్కొన్నారు. పెద్ద పెద్ద శబ్దాలతో టపాసులు కాల్చడం, ఘాటైన రసాయనిక పదార్థాలతో చేసిన టపాసులు కాల్చడం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందన్నారు. మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగించడం, హాని చేయని టపాసుల వినియోగం ద్వారా ప్రజారోగ్యానికి మేలు చేసిన వారమవుతామని పేర్కొన్నారు. ప్రజలు ఎకో ఫ్రెండ్లీ టపాసులు వినియోగించాలని, టపాసులు కాల్చి రోడ్లపై, కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందచేయడం ద్వారా పర్యావరణ రహిత పండుగ జరుపుకోవడంలో భాగస్వాములైనట్లేనని తెలిపారు. ప్రభుత్వ ధరలకు అనుగుణంగా ఇప్పటి వరకు భట్టిప్రోలు, వెల్లటూరు గ్రామాల్లో 15 మంది దీపావళి దుకాణ దారులు అనుమతి తీసుకుని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

మోతాదు మించితే ముప్పే !

- అధికంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం
- మేల్కొనకపోతే ముప్పు తప్పదంటున్న అధికారులు
- ఖర్చు తగ్గించుకోవాలని సూచన



పంట పొలంలో రసాయన ఎరువులు చల్లుతున్న వ్యవసాయ కూలీ

భట్టిప్రోలు: అతి ఎప్పుడూ అనర్థమే... మోతాదు మించితే ప్రమాదమే.. ఎరువుల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది జరగడం లేదు. విత్తనాలు చల్లింది మొదలు ఎరువులు, పురుగు మందులతోనే రైతులు సహవాసం చేస్తున్నారు. సాగులో సస్యరక్షణకు వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు అవసరమైన మోతాదులో వాడితే రైతులకు అనవసర ఖర్చు తగ్గుతుంది. ఏటా ఈ సూచనలను పక్కన పెట్టి రసాయన ఎరువులు వినియోగించి ఖర్చు పెంచుకుంటున్నారు. దీనివల్ల చీడ పీడల బెడద మరింత పెరగడమే తప్ప ఎలాంటి ఫలితం ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఏమాత్రం వరి పైరు తేడాగా కనిపించినా, ఒకటి అర దోమలు ఉన్నా వెంటనే రసాయనాలను రైతులు వినియోగిస్తున్నారు.

భూములు సారం కోల్పోయే ప్రమాదం..

వేమూరు నియోజకవర్గంలో 1.82 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. సాగులో కొద్దిపాటి మెలకువలు, వ్యవసాయ సిబ్బంది పొలంబడి ద్వారా అందిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తే రైతులకు అనవసర వ్యయం తగ్గటంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని చెబుతున్నారు. ఎరువులు, పురుగు మందులను అధిక మోతాదులో వినియోగించడం వల్ల నేల కాలుష్యం ఏర్పడి భూములు నిస్సారవంతంగా మారుతున్నాయి. వీటిలో పండించే పంట ఉత్పత్తులపై రసాయనాల ప్రభావం పెరిగి కొత్త రకం తెగుళ్లు పుట్టుకురావడంతో పాటు ఆహార నియమావళిని దెబ్బతీస్తున్నాయి. శక్తివంతమైన ఎరువుల వాడకం పెరిగిపోవడంతో రైతులకు నష్టం చేకూర్చే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ దుష్ఫలితాలు పోవాలంటే సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచడంతో పాటు భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులను వినియోగిస్తే ఆశించిన దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

అధిక వినియోగం అనర్థం

వరి సాగులో అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగులు వస్తాయి. దీనివల్ల వాటిని అరికట్టేందుకు పెట్టుబడులు పెరుగుతాయి. ఎరువులు తక్కువ మోతాదులో వాడుకోవాలి. పొటాష్‌ను కలుపుకుంటే తెగుళ్లు, పురుగుల నివారణ తట్టుకునే శక్తి ఉంటుంది.రసాయన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులు వినియోగించడం ద్వారా భూసార పరిరక్షణ సాధ్యమవుతుంది. నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించే అవకాశం ఉంటుంది. ఎరువులు వాడితే భూమి చౌడుబారే ప్రమాదం పొంచి ఉంది.

–బి.బ్రహ్మారెడ్డి, ఏఓ, భట్టిప్రోలు

పదాలను పలుకుతూ రాస్తే దస్తూరి మెరుగు



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న కాలీగ్రఫీ టీమ్ ప్రతినిధి వి.రామ్మోహనరావు

కర్లపాలెం: పదాలను పలుకుతూ రాయడం వలన విద్యార్థుల దస్తూరి మెరుగుపడుతుందని కాలీగ్రఫీ టీమ్ ప్రతినిధి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి.రామ్మోహనరావు తెలిపారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులకు చేతిరాత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులకు సరైన విధానంలో రాయటం నేర్పించాలన్నారు. ఇప్పటి వరకు 135 ఉచిత శిక్షణా శిబిరాల ద్వారా చేతిరాత శిక్షణ శిబిరాలను నిర్వహించామని ఆయన తెలిపారు. ముందుగా చక్కగా రాయటాన్ని ఉపాధ్యాయులు నేర్చుకుని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. అక్షరాల నిర్మాణ క్రమాన్ని విద్యార్థులు పలుకుతూ రాయటం వలన వారికి గుర్తుండి పోతాయని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం వేణుమాధవ్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటరెడ్డి, శారద, విజయలక్ష్మి, స్నేహలత, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి రూరల్: పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే సహించేది లేదని త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో ముద్దాయిలు, రౌడీషీటర్లు, నేరస్తులకు ఆదివారం సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో వారు చేసిన నేరాలు, ప్రస్తుత వృత్తి, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరిపై నిఘా ఉంటుందని సూచించారు. పట్టణంలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే ముందుగా పాత నేరస్తులనే విచారిస్తామని స్పష్టం చేశారు. ఇక నేరాల జోలికి పోవద్దని, కుటుంబాల కోసమైనా మారి మంచిగా జీవించాలని చెప్పారు. అనంతరం సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో రాత్రిపూట యువకుల సంచారం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించానని, రాత్రి 11 గంటల అనంతరం అకారణంగా రోడ్ల మీదకు వచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మద్యం, గంజాయి తాగి రోడ్లపై తిరుగుతున్నట్లు సమాచారం వస్తోందని, ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మనిషి జీవితంలో ఫొటో చక్కని అనుభూతి



లోగో ఆవిష్కరిస్తున్న త్రీటౌన్ సీఐ సాంబశివరావు తదితరులు

తెనాలి అర్బన్: మనిషి జీవితంలో జరిగిన అనేక సందర్భాలను కెమెరాలో బంధించి మధురానుభూతిని కలుగజేసేవారు ఫొటోగ్రాఫర్లని త్రీటౌన్ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. ఆంధ్రా ప్యారిస్ వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభోత్సవాన్ని సుల్తానాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. సంస్థ లోగోను సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు పిల్లి ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సంక్షేమం కోసం సంస్థ పాటుపడుతుందని తెలిపారు. ప్రతి సభ్యుడికీ ఐడీ కార్డులు, రూ.10లక్షల ప్రమాద బీమాను అందిస్తామని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కాళిదాసు చైతన్య, కార్యదర్శిగా గ్లోరియస్ నాగరాజు, ఉపాధ్యక్షునిగా ఆనంద్ డిసోజా, ప్రధాన కార్యదర్శిగా షేక్ రఫీ, ట్రెజరర్‌గా కొల్లి భరత్ కుమార్ ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు. వీరికి నియామక పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రసాద్ ల్యాబ్ అధినేత ప్రసాద్, నాయకులు విజయ సారథి, శేఖర్, రాజు, శ్రీకాంత్, శివ,సాగర్, సూర్య, బాజీ పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకునేందుకు ముందుకు రావాలి



నగరంపాలెం: వయో వృద్ధులను, దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట సోమువారివీధిలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల ఆదివారంలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సమితి పక్షాన తమవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అదే విధంగా వారికి చేయూత అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివ కుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, పీఎస్ఆర్ గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా నిరసన

మంగళగిరి టౌన్: భారత్‌పై అమెరికా వేస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా నుంచి భారత దేశానికి పన్నులు లేకుండా డెయిరీ ఉత్పత్తులను, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ట్రంప్ భారత ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారన్నారు. ఇది అమలు జరిగితే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడుతుందని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలయ్యే పరిస్థితి వస్తుందన్నారు. వీసాల పునరుద్ధరణకు అనుమతి వస్తుందో రాదో అన్న భయంతో ఇండియాకు వస్తే తిరిగి వెళ్లలేమన్న నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ట్రంప్ ఆంక్షలతో ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితుల్లో భారతీయులు ఉన్నారని పేర్కొన్నారు. అమెరికా వేస్తున్న సుంకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, దీనిపై భారత్ ప్రయోజనాల కోసం ట్రంప్‌ను ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి మండల అధ్యక్షులు అజయ్‌కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి దుర్గారావు, చేనేత కార్మిక సంఘం నాయకులు సీతా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల భద్రతకు ప్రత్యేక చట్టం రూపొందించాలి

మంగళగిరి టౌన్: ముస్లింల భద్రతకు ప్రత్యేక అట్రాసిటీ చట్టం రూపొందించాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాలావుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా ఫంక్షన్ హాల్‌లో ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూను రాష్ట్ర రెండవ భాషగా ప్రకటించినా అధికార వ్యవహారాల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పరిసర ప్రాంతాల్లో ఉర్దూ విశ్వవిద్యాలయాలను స్థాపించాలని తమ వేదిక డిమాండ్‌పై చర్యలు చేపడితే హర్షిస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు చైర్మన్, కౌన్సిలర్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్, ఉపాధ్యక్షులు మౌలా బేగ్ అలి, రాష్ట్ర ట్రెజరర్ అబ్దుల్ కలాం, నాయకులు నూర్జాన్, అబ్దుల్లా, నకీమా, అనీషా, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.


స్టేడియంలో గడ్డి, పిచ్చి మొక్కల తొలగింపు పూర్తి



స్టేడియం ఆవరణను శుభ్ర పరుస్తున్న సభ్యులు

తెనాలి రూరల్: చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని ఇండోర్ స్టేడియం ఆవరణను స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శుభ్రం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోవడంతో పాములు, ఇతర విష కీటకాలు సంచరిస్తున్నాయి. వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా స్టేడియం ఇన్‌చార్జ్ నాగరాజు ఆవరణను శుభ్రం చేసేందుకు పూనుకున్నారు. స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, అభ్యుదయ వాకర్స్ అసోసియేషన్, స్టేడియంలో ఏరోబిక్స్– జుంబా డాన్స్ నేర్చుకుంటున్న వారికి ఆయన విషయం తెలిపారు. దీంతో అంతా కలసి స్టేడియాన్ని వారం రోజులుగా శుభ్రం చేశారు. ట్రాక్టర్, పొక్లెయిన్, రోటవేటర్ ద్వారా పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ఆదివారం నాటికి పనులు పూర్తయ్యాయి. కార్యక్రమంలో కన్నెగంటి శ్రీనివాసరావు, గోగినేని రామకృష్ణ, బోదాడ అనిల్, రుద్రరాజు మధుసూదనరాజు, శివ గోపి, శేఖర్, పుట్టా జనార్దనరావు పాల్గొన్నారు. స్టేడియం ఇన్‌చార్జి నాగరాజు, కోచ్ గోపి పర్యవేక్షించారు.

కేఎస్ రాజుకు అభినందన



భట్టిప్రోలు: ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ (కెఎస్ జవహర్) అభినందన సభ మిత్ర మండలి ఆధ్వర్యంలో గుంటూరులో జరిగింది. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కైతేపల్లి షాలేమ్‌రాజు (కెఎస్ రాజు)ను జవహర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. సేవా కార్యక్రమాలపై కేఎస్ రాజును అభినందించారు.

ఈత పోటీల్లో విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి రూరల్: మంగళగిరిలో ఇటీవల నిర్వహించిన ఈత పోటీల్లో విజేతలకు సంగం జాగర్లమూడి స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. పట్టణానికి చెందిన రావి కిరణ్ కుమార్, మారుపూడి శ్రీనివాసరావు, నాగ బ్రహ్మారెడ్డి, నెల్సన్ మాస్టర్‌లు పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించారు. ఈ నేపథ్యంలో సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను సత్కరించారు. స్విమ్మర్స్ అసోసియేషన్ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎ.నారాయణ, రామ్మోహన్ మాస్టర్, అవనిగడ్డ ఆంజనేయులు, రావి రాంబాబు, సాయి, చందు నాయుడు, రామారావు, అర్జున్, రావి మణికంఠ, జొన్నాదుల మణికంఠ, లక్ష్మి, తేజశ్రీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఏషియన్ వాస్క్యులర్ హస్పిటల్ సహకారంతో ఆదివారం బీసీ కాలనీలోని పట్టణ రంగస్థల కళాకారుల భవనంలో ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రంగ స్థల కళాకారులకు డాక్టర్ దీపక్, డాక్టర్ మధులు సేవలు అందించారు. రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్షులు బుర్రా విజయలక్ష్మి, కార్య నిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు, దేవరపల్లి భవాని, నాయకులు రాజేంద్రప్రసాద్, అర్జున్, రఫీ, పావులూరి రాంబాబు పాల్గొన్నారు.